# పుస్తక పరిచయం




**సామాజిక విప్లవం** కోసం కొత్తతరం కథలు అని ముఖచిత్రం మీదే ప్రకటించారు ఈ కథాసంపుటి రచయిత గణపతిరావుగారు. సమకాలీన సమాజంలోని వివిధకోణాలని తీసుకుని నాటకీయతని జోడించి వ్రాసిన కథలు ఇవి. కాలక్షేపం, వినోదం కోసం వ్రాసిన కథలు కాదు. సమాజంలోని వికృతపోకడలని, హింసా ప్రవృత్తినీ, అసహజ మానసిక ప్రవర్తనలనీ రచయిత విశ్లేషిస్తూ వ్రాసిన కథలు ఇవన్నీ. ఒక్కో కథా చదువుతుంటే ఒక డాక్యుమెంటరీనో, వాస్తవ లేదా అధువాస్తవికత ధోరణిలో నిర్మించబడ్డ సినిమాలోని దృశ్యాలో చూస్తున్నట్లుంటుంది. ఈ కథలకి అంతర్జాతీయంగా పాఠకుల ప్రసంశలు విశేషంగా లభించాయి. బహుశా వారంతా ఈ కథలని ఇంగ్లీషులో చదివి వుండాలి. భారత సమాజ నేపథ్యంలో వ్రాయబడ్డ కథల గురించి అంతర్జాతీయ పాఠకుల అభిప్రాయాలు తెలుసుకోవడం కూడా ఆసక్తికరంగా ఉంటుంది. లంక భాస్కర్ చిత్రించిన ముఖచిత్రం, నర్సిమ్ చిత్రించిన లోపలి బొమ్మలు ఈ పుస్తకానికి ఒక ప్రత్యేకతని సంతరించిపెట్టాయి. పుస్తక ముద్రణ గెటప్ కూడ చాలా క్వాలిటీతో ఉంది. ప్రతి కథకి వ్రాసిన నినాదాల్లాంటి పరిచయ వాక్యాలు కథాంశాన్ని స్థూలంగా పరిచయం చేస్తున్నాయి. ‘మనిషి ఉనికి ప్రేమ. ప్రేమతో తాకితే రాయి అహల్య. ద్వేషంతో రెచ్చిపోతే అందాల ప్రకృతి కార్చిచ్చు‘ అనే ప్రథానాంశంతో వ్రాసిన కథ ఈ పుస్తకానికి శీర్షిక ఐన ‘మరిగే తారుసరోవరం‘. అలానే ‘చేసిన నేరాలు వేటకుక్కల్లా తరుముకొస్తుంటే తన అక్రమాస్తులు చితిగా మారి, మండిపోతున్నాయి‘ అనుకునే ‘పెద్దప్పరాయుడు‘, ‘ఎత్తుకుని, ముద్దాడి, లాలించాలనే వృద్ధాప్యబాల్యం, మనిషి మనుగడ పాదాల కింద క్షణక్షణం యమగండం‘ అని నిరూపించే ‘మనమింతేనా?‘.. ఏ కథచదివినా సమాజంలోని కుళ్ళు, అవినీతి, అక్రమాల మీద రచయిత ఆవేశం నిలువెత్తున ప్రతిబింబిస్తుంది. వాక్య నిర్మాణం, రచనా శైలి కూడా విలక్షణంగా ఉన్నాయి. గణపతి రావుగారి సరికొత్త ప్రయోగం కథాప్రియులకు నచ్చుతుందని ఆశిద్దాం.

* **

*Published by:*
S.Ganapathi Rao
26/1 Kaveri Street, Saligramam
Chennai – 600 093

*For Copies:*
*Visalandhra Book House*
*Navodaya Book House*




**అర్థవంతమైన కవితలు,** అర్థమయ్యే కవితలు, ఆలోచించి వ్రాసిన కవితలు, ఆలోచింపచేసే కవితలు...వ్రాసే అతికొద్ది మంది ఆధునిక కవయిత్రులలో రాధికగారు ఒకరు. ముందు మాటలో రచయిత్రిగారు వ్రాశారు -'కైవల్యం' అనే కవిత జీవితంలో తన ఆలోచనాధోరిణిని మార్చివేసిన ఒక మలుపులో వ్రాసిన కవిత అని. ఆ మలుపు తర్వాత ప్రపంచాన్ని గురించి కలుగుతున్న భావనలు వేరు అని కూడా పేర్కొన్నారు. ఈ కవితల్లో చాలా భాగం వాస్తవ చిత్రణతో మొదలై ఆ-ధ్యాత్మిక భావనలను అల్లుకుని ఒక చక్కటి ముగింపుతో పూర్తవుతుంది. 'అన్నీ తెలిసిన భాషలే / అయినా మాటలు అర్థం కావు / మళ్ళీ మళ్ళీ చూసిన మొహాలే / అయినా మనసులో నిలబడవు ' ఇదంతా వాస్తవాన్ని చూపిస్తే 'మనుషుల్ని ఒకచోట / మనసుల్ని మరోచోట విసిరేసి/ మరణించే లోపల వెతుక్కోమంటాడు (దేవుడు)' అంటూ తన ఆలోచనా ధోరణిలోని మరోకోణాన్ని ప్రదర్శిస్తారు రచయిత్రి. ఏ కవితా అలవోకగా చదివి మరచిపోయేది కాదు. 'మందులేని గాయాలని మాన్పగలదు / మండించే వేదనలని ఆర్పగలదు ( కాలం) ' లాంటి వాక్యాలు ఎక్కడైనా ఉదహరించడానికి సరిపోతాయి. ముందుమాటలో ప్రముఖ కవి అద్దేపల్లి రామ్మోహనరావు గారు ఈ కవితా సంపుటి గురించి తనదైన శైలిలో చక్కటి విశ్లేషణ వ్రాశారు. చివరి అట్టమీద - ఆశీస్సులనందించిన సామవేదం షణ్ముఖ శర్మగారు "సామాజిక రీతుల్ని విశ్లేషించి ఎత్తి చూపుతూ, మనో ప్రకృతిలోని వికృతుల్నీ, వివిధ మనోభావాల వెలుగునీడల్నీ - కవిత్వపు విలువలు కదిలిపోకుండా, పకడ్బందీగా వీటిలో పరామర్శించారు. " అన్నారు. ఈ మాటలు అక్షర సత్యాలని ఈ కవితా సంపుటి చదివిన ప్రతి ఒక్కరూ అంగీకరిస్తారు.

* **

*Published by:*
**Pramatha Publications**
**Hyderabad – 500 070**
**For Copies**
**T.Srivalli Radhika**
**5-4-345 Road Number 5**
**Kamala Nagar, Vanasthalipuram**
**HYDERABAD – 500 070**
**Phone : 040-2412 4124**

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

**Editor,**
**KOUMUDI(Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**